క్లుప్తంగా

నర్సరీల పరిశీలన

అన్నపురెడ్డిపల్లి: పంచాయతీ నర్సరీల్లోని మొక్కల పెంపకంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ మహాలక్ష్మి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ఆమె పర్యటించి నర్సరీలు, ఉపాధీ హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎండల తీవ్రత దృష్ట్యా మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. నర్సరీలలో మొక్కలకు నీటిఎద్దడి లేకుండ చూడాలన్నారు. ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని, కూలీలకు సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఉపాధిపనులను వేగవంతం చేయాలన్నారు.అనంతరం పెంట్లం పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ జగదీశ్వర్‌ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. కార్యక్రమాలలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు తప్పనిసరి

కరకగూడెం: మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వాహకులు నిబంధనలు తప్పకుండా పాటించాలని పినపాక ఎంపీఓ వెంకటేశ్వరరావు సూచించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం పినపాక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రజలకు పూర్తిస్థాయిలో స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, నీటిలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సరఫరా చేయాలని పేర్కొన్నారు. అంతేకాకుండా గ్రామపంచాయతీ పరిధిలోని చలివేంద్రాలకు సైతం స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలన్నారు. ఈ సమావేశంలో సెక్రటరీ జైపాల్ రెడ్డి,మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

పనిభారం తగ్గించాలి

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పీకేఓసీ గనుల ఉద్యోగులపై పని భారం పడుతోందని, యాజమాన్యం మ్యాన్ పవర్‌ను పెంచి పని భారం తగ్గించాలని గుర్తింపు కార్మిక సంఘమైన ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై రాంగోపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉత్పత్తి లక్ష్య సాధన కోసం యాజమాన్యం ఉద్యోగులపై పని భారం పెంచుతూ తీవ్ర ఒత్తిడికి గురి చేస్తోందన్నారు. గనులలో సరైన మ్యాన్ పవర్ లేకపోవడం వల్లే ఉన్న కార్మికులపై పని భారం పెరుగుతుందని, తద్వారా ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే సపోర్ట్ ఎక్విప్‌మెంట్స్ మోటార్ గ్రేడర్, డోజర్స్, వాటర్ ట్యాంకర్ల మరమ్మతులకు గురవడంతో ఉత్పత్తికి తీవ్ర ఆటంకం ఏర్పడుతోందని వెల్లడించారు.

ప్రమాదంలో గాయాలు

దమ్మపేట: ద్విచక్రవాహనం అదుపు తప్పి రోడ్డుపై పడిన ఘటనలో ఇద్దరు వ్యక్తులకు గాయాలైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మొద్దులగూడెం గ్రామానికి చెందిన చీమలశ్రీను, దొడ్డా శ్రీనులు తమ ద్విచక్రవాహనంపై సత్తుపల్లిలో కూరగాయలు విక్రయించి వస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని గున్నేపల్లి కాలనీ సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డుపై పడి ఇద్దరికి గాయాలయ్యాయి. గాయాలపాలైన క్షతగాత్రులను సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. కాగా దొడ్డ శ్రీను పరిస్థితి విషమంగా ఉంది.

లారీల అతివేగాన్ని నియంత్రించాలి

మణుగూరురూరల్: మణుగూరు–ఏటూరునాగారం ప్రధాన రహదారిపై సాంబాయిగూడెం మీదుగా బీటీపీఎస్, ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించే బొగ్గు, ఇసుక లారీల అతివేగాన్ని నియంత్రించాలని సీపీఎం మండల కార్యదర్శి కొడిశాల రాములు డిమాండ్ చేశారు. శుక్రవారం జరిగిన సాంబాయిగూడెం గ్రామశాఖ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో రాకపోకలు సాగిస్తున్న ఇసుక, బొగ్గు లారీలు వేగంగా వెళుతున్నాయని, రాత్రి వేళల్లో వీధిలైట్లు కూడా లేకపోవడంతో పశువులు ప్రమాదాలకు గురౌతున్నాయని అన్నారు. అంతర్గత రోడ్లకు ఇరువైపులా సైడ్ కాలువలు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు సత్రపల్లి సాంబశివరావు, నరసమ్మ, సోమిరెడ్డి బాబురావు, చిన్న సంజీవ రెడ్డి, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ పోల్ చీటీలు

- బీఎల్వోల ద్వారా పంపిణీ ప్రక్రియ మొదలు..
- పోలింగ్ కేంద్రాల సమాచారం, ఇతర వివరాలతో ముద్రణ
- వచ్చే నెల 2వ తేదీ నాటికి పంపిణీ పూర్తి చేసేలా కార్యాచరణ

భద్రాచలంఅర్బన్: పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా పోల్ చీటీల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు పోల్ చీటీలు అందజేస్తున్నారు. గురువారం నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమైంది.

చీటీలోనే పోలింగ్ వివరాలు..

పోల్‌చీటీలో ఓటరు పేరు, తండ్రి/భర్త పేరు, పోలింగ్ కేంద్రం పేరు, సంఖ్య, చిరునామా, ఓటరు జాబితా క్రమసంఖ్య తదితర వివరాలు పొందుపర్చారు. అంతేకాక బీఎల్ఓ పేరు, సెల్ నంబర్ కూడా ముద్రించారు. అలాగే, పోలింగ్ రోజు ఓటర్లు పాటించాల్సిన నిబంధనలు కూడా ఉన్నాయి. ఇవేకాక ఎన్నికల ఉల్లంఘనలు జరిగినా, రాజకీయ పార్టీలు ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినా ఫిర్యాదుచేసేందుకు రాష్ట్ర ఎన్నికల అధికారి వెబ్‌సైట్, టోల్ ఫ్రీ నంబర్ కూడా ముద్రించారు. అంతేకాక ఫొటో స్థానంలో క్యూఆర్ కోడ్ ముద్రించి..


ఓటర్లకు పోల్ చీటీ అందజేస్తున్న బీఎల్ఓ

దాన్ని స్కాన్ చేస్తే పూర్తి వివరాలు వచ్చేలా ఏర్పాటు చేశారు. పోల్‌చీటీ వెనకాల పోలింగ్ కేంద్రాన్ని సులువుగా గుర్తించేలా గూగుల్ మ్యాప్ సైతం ముద్రించారు. గతంలో పోల్ చీటీలను రాజకీయ పార్టీల నాయకులే ముద్రించి పంపిణీ చేయగా.. అందరికీ అందక ఇబ్బంది పడేవారు. ఈ నేపథ్యాన ఓటర్లకు సమాచారం ఇచ్చేలా ఎన్నికల సంఘం వీటిని ముద్రించి పంపిణీ చేస్తోంది.

2వ తేదీ టార్గెట్..

భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 176 పోలింగ్ కేంద్రాలు, 1,52,683 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 72,994 పురుషులు, 79,681 మహిళలేకాక ఇతరులు ఎనిమిది మంది ఉన్నారు.


స్లిప్ ముందు భాగంలో క్యూఆర్ కోడ్

వీరందరికీ బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి పోల్‌చీటీలు అందజేస్తున్నారు. ఎన్నికల సంఘం మే 8వ తేదీ నాటికి పంపిణీ పూర్తిచేయాలని ఆదేశించినా 2వ తేదీ వరకే ప్రతీ ఓటరుకు చేరవేసేలా అధికారులు కార్యాచరణ రూపొందించారు.

అందరూ ఓటు వేసేలా చర్యలు



లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా చర్యలు చేపడుతున్నాం. ఇందుకు అవసరమైన పోల్‌చీటీల పంపిణీ చురుగ్గా సాగుతోంది. బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు వీటిని అందజేస్తున్నారు. పోల్ చీటీల పంపిణీని మే 2వ తేదీ నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం.

– కె.దామోదర్‌రావు, ఆర్డీఓ, భద్రాచలం

తాగునీటి ఎద్దడిపై చర్యలు తీసుకోవాలి

అన్నపురెడ్డిపల్లి: గ్రామాల్లో మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీఓ రాజీవ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలో డంపింగ్ షెడ్, నర్సరీలోని మొక్కలను, అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ప్రకృతి వనాలలో మొక్కలు ఎండిపోకుండా నీటిని సప్లయ్ చేయాలన్నారు. డంపింగ్ షెడ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పైప్‌లు లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయించాలని, మంచినీటి సమస్య రాకుండ జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అభివృద్ధి పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట


డంపింగ్ షెడ్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

పంచాయతీ కార్యదర్శి ఖాదర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో ఉండాలా.. రాజీనామా చేయాలా?

దుమ్ముగూడెం: మండలంలోని బీజేపీ నాయకులు ఉండాలా.. రాజీనామాలు చేయాలా అని బీజేపీ మండల అధ్యక్షుడు తెల్లం శేఖర్ పార్టీ బాధ్యులను ప్రశ్నించాడు. శుక్రవారం రామచంద్రునిపేట గ్రామంలో జరిగిన ఆ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మహబూబాబాద్ పార్లమెంట్ స్థానానికి సంబంధించి నియోజకవర్గం కన్వీనర్ గోలకోటి త్రినాథరావును అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎదురైన సమస్యను లేవనెత్తే సరికి తనను పక్కనబెట్టాడని, వేరేవారితో ప్రచారం చేయించు కుంటున్నారని అన్నారు. బీజేపీలో ఉన్న కొద్ది మంది నాయకులను రెండు వర్గాలుగా చీల్చి కేవలం ఐదుగురితో పని చేయించుకుంటానని త్రినాథరావు చాలెంజ్ చేస్తున్నాడని ఆరోపించారు. ఈ విషయాన్ని జిల్లా అధ్యక్షుడు, పార్లమెంట్ కన్వీనర్‌కి, నియోజకవర్గం ఉదయప్రతాప్‌కి చెప్పినప్పటికీ పట్టించుకోలేదన్నారు. మండలంలో ఇంత వరకూ తాను ప్రచారం నిర్వహించలేదని, ఈ పార్టీలో కొనసాగాలో లేదో తెల్పాలని తెల్లం శేఖర్ విస్మయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కుర్సం వసంతరావు, గిరిజన మోర్చా అధ్యక్షులు కోర్స రమేష్, కారం చిన్నయ్య, కామయ్య, రఘువయ్య, వెంకటేష్, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేస్తే చర్యలు


భద్రాచలంలోని ఓ స్కానింగ్ సెంటర్‌లో తనిఖీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

భద్రాచలంఅర్బన్: రేడియోలజిస్ట్, గైనకాలజిస్ట్ రిఫరెన్స్ లేకుండా స్కానింగ్‌లు చేయవద్దని, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తీసుకుంటామని ఎంసీహెచ్ అధికారి డాక్టర్ చైతన్య, డిప్యూటీ డీఎంహెచ్ఓ ఎండి.ఫైజ్ మోహినుద్దీన్ స్కానింగ్ సెంటర్ల వైద్యులను హెచ్చరించారు. శుక్రవారం భద్రాచలంలో ఉన్న స్కానింగ్ సెంటర్‌లలో వైద్యాధికారులు డా.చైతన్య, ఎండి.ఫైజ్ మోహినుద్దీన్‌లు తనిఖీలు నిర్వహించారు. స్కానింగ్ నిర్వహణకు సంబంధించిన అన్ని రికార్డులను పరిశీలించారు. ఎఫ్ ఫార్మ్‌ను ఆన్‌లైన్ చేసే విధానం, స్కానింగ్ నిర్ధారణ పరీక్షలపై స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. మాట్లాడుతూ.. స్కానింగ్ చేసేటప్పుడు గర్భిణి స్త్రీ అనుమతి తీసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లో లింగ నిర్ధారణ చేయవద్దని సూచించారు. తనిఖీల్లో హెల్త్ ఎడ్యుకేటర్ టి.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు పీఓ అభినందనలు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థినులు జేఈఈ ఫలితాలలో ఉత్తమ ప్రతిభను కనబరిచి ర్యాంకులు సాధించిన సందర్భంగా భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ శుక్రవారం తన చాంబర్‌లో ఆయా విద్యార్థినులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాహితీ, నిహారికలు భద్రాచలం ఖ్యాతిని పెంచారని, ఏజెన్సీలో విద్యని అభ్యసిస్తున్న ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అవరోధించాలని అన్నారు. లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థలు భవిష్యత్తులో మరెన్నో విజయాలను అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో లిటిల్ ఫ్లవర్స్ విద్యా సంస్థల డైరెక్టర్ మాగంటి రమేష్ బాబు, విద్యార్థినుల తల్లిదండ్రులు, అధ్యాపకులు బషీర్ పాల్గొన్నారు.

మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో..

చర్ల: చర్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివి ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన పలువురు విద్యార్థులను శుక్రవారం సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ


విద్యార్థినులను అభినందిస్తున్న ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్

మండల కార్యదర్శి కొండా కౌశిక్ విద్యార్థులను అభినందించారు. ఒకేషనల్ విభాగంలోని ఈటీ గ్రూపులో 972 మార్కులు సాధించి కళాశాలలో మొదటి స్థానంలో నిలిచిన వాసం కావ్య, జనరల్ విభాగంకు చెందిన బైపీసీలో 934 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచిన కారం సింధూజలను ఘనంగా అభినందించారు. భవిష్యత్తులు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చెన్నం మోహన్‌రావు, మహమద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని పాత మార్కెట్ వ్యాపారస్తులు ఓ విద్యార్థిని ఉన్నత చదువులకు శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. సారపాక గ్రామానికి చెందిన తిరుమలరావు కుమార్తె అమృత సాయి హైదరాబాద్ సీఎంఆర్ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్‌లో ఉచిత సీట్ సాధించింది. విద్యార్థినీ కళాశాలలో చేరేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతుండడంతో పాత మార్కెట్ వ్యాపారస్తులు రూ.15 వేలు తన తండ్రి తిరుమలరావుకు అందజేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ, రామకృష్ణ, శ్రీనివాసరావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని మానవ సేవ వృద్ధాశ్రమంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భద్రాచలం మాజీ ఎమ్మెల్యే అమరజీవి ముర్ల యర్రయ్య రెడ్డి 26వ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబసభ్యుల సరోజమ్మ, మానవసేవ వాలంటరీ ఆర్గనైజేషన్ అనాథ, వృద్ధాశ్రమంలో అన్నదానంతో పాటు నిత్యవసర వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముర్ల రమేష్, ముర్ల నాగవేణి, ముర్ల ఉమాదేవి, కరుణ, సాయి మణికంత, నవ్య శ్రీ, తమ్మిశెట్టి రత్నం, గుంటి రాజేష్, లలిత కుమారి, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు మంజూరు చేయాలి

చంద్రుగొండ: ఉపాధి పనుల చేస్తున్న కూలీలకు సత్వరమే బిల్లులు ఇవ్వాలని అఖిల భారత రైతుకూలీ సంఘం రాష్ట్ర నాయకుడు ఎస్‌కె.ఉమర్ డిమాండ్ చేశారు. తిప్పనపల్లి, వెంకటాపురం, తుంగారం, రేపల్లెవాడ, గానుగపాడు తదితర గ్రామాల్లో ఆయన పర్యటించి ఉపాధి కూలీలతో మాట్లాడారు. పనిప్రదేశాల్లో నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేయాలని, వైద్య సదుపాయం, ఓఆర్ఎస్ పాకెట్లు, మజ్జిగ పాకెట్లు పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పలుగు, పార ఉచితంగా ప్రభుత్వమే పంపిణీ చేయాలన్నారు. ప్రతి వారం చివరిలో కూలీ మొత్తం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వరికూటి వెంకట్రావ్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఎల్లమ్మ గుడి నిర్మాణానికి భూమి పూజ

గుండాల: మండలంలోని గౌడ కులస్తుల కుల దైవం ఎల్లమ్మ గుడి నిర్మాణం కోసం శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. మండల కేంద్రంలో సంత ఎదురుగా గౌడ కులస్తుల సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ గుడి నిర్మాణం చేయదలసి పూజారి సనత్ ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. గుండెబోయిన నాగరాజు, మొక్కా నరేందర్ దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుల పెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ ప్రతిష్ఠ


అన్నపురెడ్డిపల్లి: హోమశాలలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో శ్రీముత్యాలమ్మ ఆలయ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం వైభవంగా జరిపించారు. వెల్లటూరి ప్రసాదాచార్యుల ఆధ్వర్యంలో అర్చక బృందం హోమాలు, ప్రత్యేక పూజలను జరిపించి ప్రతిష్ఠ చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు వేరువేరుగా పాల్గొని, పూజలు చేశారు. నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ వ్యయ ప్రధాత మారగాని శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వనమా గాంధీ, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, పర్సా వెంకటేశ్వర్లు, ఇనపనూరి రాంబాబు, చల్లారామేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

చర్లరూరల్: మండలంలోని కొత్తగట్ల గ్రామంలో అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బుధవారం, గురువారాలు విశిష్ట పూజల అనంతరం శనివారం గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొని ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఏఐసీసీ జనరల్ సెక్రటరీని కలిసిన రోశిరెడ్డి

బూర్గంపాడు: ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రమేష్ చెన్నితలను కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు యడమకంటి రోశిరెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కొచ్చిన్‌లో జరిగిన పార్టీ వ్యవహారాల కార్యక్రమంలో పాల్గొన్న ఆయనను కలిసిన రోశిరెడ్డి.. భద్రాచల రామయ్య శేషవస్త్రాలు, లడ్డు ప్రసాదాలను అందించారు. అనంతరం తెలంగాణ రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికలపై కొద్దిసేపు మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ నాయకులు ఐక్యంగా పనిచేసి అన్ని పార్లమెంట్ స్థానాలను గెలిపించుకోవాలని రమేష్ సూచించారు.


రమేష్ చెన్నితలకు శాలువా కప్పి సన్మానిస్తున్న రోశిరెడ్డి

శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి


బాస్కెట్‌బాల్ ఆడి శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీజీఎం రమేశ్

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ ఆధ్వర్యంలో పీవీకాలనీలో సింగరేణీయుల పిల్లలకు పలు క్రీడల్లో ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని డీజీఎం(పర్సనల్) సలగల రమేశ్ అన్నారు. శుక్రవారం పీవీకాలనీలోని భద్రాద్రి స్టేడియంలో నెల రోజుల పాటు సింగరేణీయుల పిల్లలకు పలు క్రీడలలో శిక్షణ నిమిత్తం నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు శారీరక ఉత్సాహాన్ని ఉల్లాసాన్ని చురుకుదనాన్ని సమయస్ఫూర్తిని పెంచుతాయన్నారు. వేసవి సెలవులు సెల్‌ఫోన్లతో కాలక్షేపం చేసి వృథా చేసుకోకుండా పిల్లలు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకునే విధంగా తల్లిదండ్రులు వేసవి శిక్షణ శిబిరాలకు పంపాలన్నారు. మే 20వ తేదీ వరకు అథ్లెటిక్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, కరాటే వంటి విభాగాలలో శిక్షణనివ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మేకల ఈశ్వర్, ఐఎన్‌టీయూసీ నాయకులు కృష్ణంరాజు, సీఎంఓఏఐ అధ్యక్షుడు కృష్ణమూర్తి, డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ ఎండీ మదార్ సాహెబ్, సీనియర్ పర్సనల్ అధికారి సింగు శ్రీనివాస్, స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ శ్రీనివాస్, సురేశ్, రాంలాల్, శిక్షకులు, శ్వేతస్, ప్రేమ్, నాగరాజు, మనోజ్‌కుమార్, పద్మ, అరుణ్‌పాల్ పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు కల్పించండి

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని వృత్తి శిక్షణా కేంద్రంలో కనీస సౌకర్యాలు లేక ట్రెయినింగ్‌కు వచ్చే కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వసతులు కల్పించాలని ఏఐటీయూసీ నాయకులు మేనేజర్ నాగేశ్వరరావుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కార్మికులు మాట్లాడుతూ.. క్లాస్‌రూంల్లో సరైన ఫ్యాన్స్, కూలర్లు లేవని, తాగునీటి ఫ్రిజ్ కూడా రిపేరులో ఉండటంతో తాగునీటి కోసం ఇబ్బందులు పడే పరిస్థితి ఉందన్నారు. ఏఐటీయూసీ సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ దాట్ల సందీప్, కౌన్సిల్ మెంబర్ విజయ్‌కుమార్, కేసీహెచ్‌పీ అసిస్టెంట్ పిట్ సెక్రటరీ మిట్టపల్లి వెంకటేశ్వర్లు, బీవీవీ సత్యనారాయణ, పి.హరినాథ్ బాబు తదితరులు ఉన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు బీజేపీని ఓడించాలి

చర్ల: కార్మికుల హక్కులు కాపాడేందుకు, భారత రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ బీజేపీని ఓడించేందుకు సిద్ధమవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కొలగాని బ్రహ్మచారి పిలుపునిచ్చారు. శుక్రవారం చర్లలోని బీఎస్ రామయ్య భవన్‌లో సీఐటీయూ మండల కమిటీ సభ్యులు విజయశీల అధ్యక్షతన 'పార్లమెంట్ ఎన్నికలు–కర్తవ్యాలు'అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. బీజేపీ పాలనలో ప్రభుత్వం మొత్తం బడా కంపెనీలు, సంపన్నుల సేవలతోనే సాగిందని ఆయన విమర్శించారు. మళ్లీ అధికారంలోకి రాగానే రాజ్యాంగాన్ని రద్దు చేస్తామంటూ సాక్షాత్తు బీజేపీ ఎంపీలు, మంత్రులు పేర్కొనడం చూస్తుంటే దేశంలో ప్రజాస్వామ్యం నియంతృత్వంగా మారిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగ బద్ధంగా స్వయం ప్రతిపత్తితో పని చేయాల్సిన ఎన్నికల కమిషన్, సీబీఐ, ఐటీ, ఈడీ వంటి సంస్థలను


సదస్సులో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మచారి

బీజేపీ తన జేబు సంస్థలుగా మార్చుకున్నదని ఆయన విమర్శించారు. బీజేపీ ఓటమి కోసం ప్రతి కార్మికుడినీ కలిసి ప్రచారం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సదస్సులో సీఐటీయూ ఆటో యూనియన్ అధ్యక్షుడు పామారు బాలాజీ, నాయకులు సోడి పృథ్వీ, విజయ్, నర్సింహారావు, కిశోర్, నవీన్, సంపత్, లక్ష్మీ, సావిత్రి, సుభద్ర, సత్యావతి, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై పోరాడుతా..

ములకలపల్లి: నిత్యం ప్రజల మధ్య ఉంటూ, ప్రజల సమస్యలపై పోరాడే తనను ఆదరించాలని బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు కోరారు. ములకలపల్లి మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన రోడ్డు షోలో ఆయన మాట్లాడారు. మాయమాటలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ఎన్నికల హామీల అమలులో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. 2 లక్షల రుణమాఫీ, డబుల్‌బెడ్‌రూం తదితర హామీలు ఎందుకు నేటికీ ఇవ్వలేదని ప్రశ్నించారు. మరోమారు మోసపోవద్దని ఓటర్లను కోరారు. తెలంగాణ రాష్ట అభివృద్ధికి అహర్నిశలు శ్రమించిన కేసీఆర్‌ను ఆశీర్వదించాలన్నారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌పార్టీని ఆదిరించాలని, కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ డీసీసీబీ


మాట్లాడుతున్న నామా నాగేశ్వరరావు

చైర్మన్ కూరాకుల నాగభూషణం, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చానాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, నియోజవర్గ నాయకులు ఒగ్గేల పూజ, జెడ్పీటీసీ సున్నం నాగమణి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మోరంపూడి అప్పారావు, నందమూరి సురేష్, వెంకటేశ్వరరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర అభివృద్ధే లక్ష్యం

ములకలపల్లి: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ములకలపల్లి మండల పరిధిలోని తిమ్మంపేట గ్రామానికి చెందిన తాను పక్కా లోకల్ అని, జిల్లా సమగ్రాభివృద్ధియే తన అభిమతం అని భారతీయ జనతా పార్టీ ఖమ్మం ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన రోడ్డు షోలో పాల్గొని ఆయన మాట్లాడారు. మోదీ దూతగా ప్రజా సేవ లక్ష్యంగా రాజకీయ రంగంలోకి అడుగుపెట్టానన్నారు. ఖమ్మం జిల్లాలో విద్యా, వైద్యం, పరిశ్రమల ఏర్పాటులో గత పాలకులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీని గెలిపిస్తే ఖమ్మం జిల్లాను అన్ని రంగాల్లో ముందు వరుసలో ఉంచుతానని అన్నారు. అనంతరం మెయిన్ సెంటర్‌లో బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించారు.


మాట్లాడుతున్న తాండ్ర వినోద్‌రావు

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కేవీ రంగాకిరణ్, ఖమ్మం పార్లమెంట్ నియోజవర్గ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, మండల అధ్యక్షులు అనుమల శ్రీనివాస్, అప్పన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే భద్రాద్రి అభివృద్ధి

భద్రాచలంటౌన్: భద్రాచలం నియోజకవర్గ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ గెలుపు కోసం ఆయన భద్రాచలం పట్టణంలో శుక్రవారం ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయంలో వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు భద్రాచలం ఏజెన్సీలో అనేక అభివృద్ధి పనులు జరిగాయన్నారు. భద్రాద్రి వాసులు హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు బుడగం శ్రీనివాస్, బలుసు నాగ సతీష్, సరెళ్ళ నరేష్, బోగల శ్రీనివాస్ రెడ్డి, సరెళ్ల వెంకటేష్, రాము, రాగం సుధాకర్, ఆలీ పాషా, నర్రా


బజ్జీల బండి వద్ద ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

రాము, దుద్దుకూరు సాయిబాబా, గండేపల్లి హనుమంతరావు, ఎండి నవాబ్, రామిరెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, వసంతాల రాజేశ్వరి, తుమ్మల రాణి, ఒంగోలు దేవకి, కట్టా కళ్యాణి, పద్మప్రియ, రూపా దేవి తదితరులు పాల్గొన్నారు.